క్లుప్తంగా

మొక్కల పెంపకంతో భవిష్యత్ తరాలకు సంరక్షణ

బ్రహ్మంగారి మఠం : స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే మొక్కలను పెంచితే భవిష్యత్ తరాలకు రక్షణ ఉంటుందని వేంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎస్‌కె.వల్లి, ప్రిన్సిపల్ మాధవరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కిరణ్ అన్నారు. బి.మఠం విరాట్ నగర్‌లోని తపాలా కార్యాలయం ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ భూమి కోతకు గురికాకుండా, వన్యప్రాణులకు రక్షణ కల్పించేందుకు మొక్కల పెంపకం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగన్, శారద, బాలసుబ్బయ్య, సబ్ పోస్ట్‌మాస్టర్ సత్యబాబు, పండిట్, రమణ, రాందాస్ నాయక్, నాగేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం



గెలుపొందిన విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్లు

చాపాడు : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని ఎంఈఓ రవిశంకర్ అన్నారు. చాపాడు జీఏఎస్ హైస్కూల్‌లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు గురువారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో పాల్గొనేలా ఫిజికల్ డైరెక్టర్లు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వంశీకృష్ణ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివారెడ్డి, ఓబయ్య, హెచ్‌ఎం కొత్తపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ ఇందిర

ప్రొద్దుటూరు : మానవసేవే మాధవసేవ అని పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఇందిర అన్నారు. స్థానిక రాస్ వికాస్ రిహాబిలిటేషన్ అండ్ కేర్ సెంటర్ (మానసిక దివ్యాంగుల సంరక్షణ కేంద్రం)లో పశువైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన కిట్లు, స్టేషనరీ, వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తమ సేవా కార్యక్రమాల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగించారన్నారు. ప్రతి విద్యార్థి కేవలం సహాయం మాత్రమేకాక ప్రేమ, సామాజిక బాధ్యతను గుర్తించి సమాజానికి మేలు చేసే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వడ్డించారు.

ఆర్‌ఆర్‌బీ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగాల కోసం ఈనెల 13 నుంచి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక జేవీవీ కార్యాలయంలో ఉచిత కోచింగ్‌కు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక జేవీవీ కార్యాలయంలో నిపుణులైన అధ్యాపక బృందంతో నాలుగు నెలలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 9705333305 నంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రాకేష్, జయసింహా, కోచింగ్ విద్యార్థులు హరీష్, మహేష్ పాల్గొన్నారు.

సన్మానం



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) సభ్యులుగా నియమితులైన మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డిని గురువారం నెల్లూరురోడ్డులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో పలువురు మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 14వ వార్డు ఇన్‌చార్జి సరిటాల మౌలాలి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షఫీ, జిల్లా కార్యదర్శి షేక్‌గౌస్‌బాష (బాబ్జీ), గోపవరం మండల అధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శి ఖాదర్‌వలిలతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలు వెలుగులోకి వచ్చేనా!

- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా ఉపాధి పనులు
- చేసిన పనినే మళ్లీ చేసి బిల్లులు స్వాహా చేసిన కూటమి నేతలు
- మొక్కుబడిగా సామాజిక తనిఖీలు
- నేడు రూ.4.79కోట్ల ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం



కామనూరులో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 2004–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల నాణ్యత, అక్రమాలపై శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, ఎమ్మెల్యే సమక్షంలో ఓపెన్‌ఫోరం నిర్వహించున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న ఆరు మంది ఫీల్డు అసిస్టెంట్లను తొలగించి తమ పార్టీకి చెందిన వారిని నియమించుకున్నారు. కూటమి నాయకులు ఏమి చెబితే అది తల ఊపేలా ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లను తయారు చేసి అక్రమాలకు పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మండలంలో 201 రకాల ఫీల్డు, ఛానల్స్, ఫీడర్ ఛానల్స్‌కు సంబంధించిన పూడిక తీత పనులు, 968 హౌసింగ్ పనులకు సంబంధించి 90 రోజుల పనులు, 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ జరిగాయి. ఈ పనులకు గానూ ఉపాధి పథకం నుంచి రూ.4,79,03,207లు ఖర్చు చేశారు. ఈ పనులలో నాణ్యతలను, అక్రమాలను వెలుగు తీసేందుకు 12 మంది డీఆర్పీలు, ఒక ఎస్ఆర్పీ సామాజిక తనిఖీ చేపట్టారు. గత నెల 25 నుంచి ఈ నెల 3వ తేది వరకూ గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్పీలు క్షేత్రస్థాయికి వెళ్లి సామాజిక తనిఖీలు నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పూడిక తీసిన కాలువల కొలతలు, శ్రామికులకు అందిన వేతనాలు, హౌసింగ్ నిర్మాణాలపై విచారణ చేపట్టి నివేదిక తయారు చేశారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు ఏర్పాటు చేసి శ్రామికులతో డీఆర్పీలు చర్చించారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీలు

12 మంది డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీలు మొక్కుబడిగా సాగినట్లు తెలుస్తోంది. మండలంలో 201 ఫీల్డు, ఫీడర్స్ ఛానల్స్‌లలో డీఆర్పీలు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి చూస్తే ఎక్కడి చూసినా సాగునీటిలో నిండి ఉన్నాయి. ఎక్కువ భాగంలో పంట సాగులో సాగు నీరు ఉండడం, ఫీల్డు, ఫీడర్ ఛానల్స్‌లలో గడ్డి, జమ్ము అలుముకోవడంతో సక్రమంగా తనిఖీలు చేపట్టలేదు. జమ్ము, గడ్డి పెరిగిన కాలువల్లో పూడిక తీత జరిగిందా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అయితే అక్కడ క్షేత్ర స్థాయిలో ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చెప్పిన మాటలనే పరిగణలోకి తీసుకుని డీఆర్పీలు నివేదిక సిద్ధం చేశారు. దీంతో ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలు బయటికి రాలేదు.

ఉపాధి పనులలో అవినీతి ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు అనుకూలంగా లేని ఫీల్డు అసిస్టెంట్లను తొలగించి అనుకూలంగా ఉండే ఫీల్డు అసిస్టెంట్లను నియమించుకున్నారు. మండలంలోని కల్లూరు, సీతంపల్లె, ఉప్పరపల్లె, గోపవరం, దొరసానిపల్లె, చౌటపల్లె గ్రామాలలోని ఫీల్డు అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి బెదిరించి వారి చేతనే రాజీనామా చేయించి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో గతేడాది చేసిన పనులనే మళ్లీ ఈ ఏడాది పూడిక తీత పనులను చేపట్టి అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా చాలా మంది కూలీలను బినామీ పేర్లతో హాజరువేసుకుని డబ్బులు డ్రా చేసుకున్నారు. దొరసానిపల్లెకు చెందిన 10 మంది కూలీల పేర్లతో 9 వారాలు మస్టర్లు వేసుకుని డబ్బులు డ్రా చేసుకున్నారు.

అయితే వీరి 10 మంది కూలీలకు సంబంధించి రామాపురం గ్రామస్తుల ఫొటోలను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేశారు. దొరసానిపల్లె కూలీలకు రామాపురం కూలీల ఫొటోలను సిస్టమ్‌లో జతపరచడంపై అక్కడి ఫీల్డు అసిస్టెంట్లను, అక్కడ సామాజిక తనిఖీ చేసేందుకు వచ్చిన డీఆర్పీలను ప్రజలను ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే వ్యవసాయ పొలాల్లోని ఫీల్డు, ఫీడర్ ఛానల్లు సాగునీటితో నిండిపోవడంతో అవి పూడిక తీత పనులు జరిగాయా లేదా అనే అనుమానాలు లేకపోలేదు.

ఏపీఓ ఏమన్నారంటే..

ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకపై ఉపాధి ఏపీఓ మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఫీల్డు, ఫీడర్స్ ఛానళ్లు సాగునీటితో నిండిపోవడంతో వాటిపై కొలతలు మాత్రమే డీఆర్పీలు తీసుకున్నారని, కాలువల లోతు తీసుకోలేకపోయారన్నారు. దొరసానిపల్లె, రామాపురం గ్రామాల్లో జరిగిన అవకతవకలు తన దృష్టికి రాలేదని దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన



పోస్టర్లు ప్రదర్శిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు, చైతన్య సొసైటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఎయిడ్స్ నిర్మూలన రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను అలవరచుకోవాలన్నారు. సోషల్ మీడియా మోసాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధుల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘునాథ్‌రెడ్డి, అధ్యాపకులు కిశోర్, వెంకటరామిరెడ్డి, సందీప్‌కుమార్‌రెడ్డి, నాయబ్‌రసూల్, శైలజ, రామకృష్ణ, గోవిందమ్మ, జ్యోతి, మరియాదాస్, చైతన్య సొసైటీ సిబ్బంది సునీత పాల్గొన్నారు.

బ్యానర్‌లో కనిపించని ఆరోగ్యశాఖ మంత్రి ఫొటో



మంత్రి సత్యకుమార్ ఫొటో లేకుండా ముద్రించిన బ్యానర్

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఐఎంఏ హాల్‌లో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' ఔషధాల తగ్గింపు, ఆరోగ్య జీవిత బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యానర్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఫొటో లేకపోవడంతో బీజేపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమాన్ని బహిష్కరించి వెంటనే నిరసన తెలపాలని ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయం నుంచి ప్రొద్దుటూరులోని బీజేపీ నాయకులకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రభుత్వమే ఈ బ్యానర్లు, కరపత్రాలను పంపించిందని ఇందులో తమ ప్రమేయం లేదని స్థానిక వైద్యాధికారులు బీజేపీ నాయకులకు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అధికారుల అభ్యర్థన మేరకు బీజేపీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు అందుబాటులో వైద్య సేవలు

జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల పేదలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఐఎంఏ హాల్‌లో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' ఔషధాల తగ్గింపు, ఆరోగ్య జీవిత బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ జీఎస్టీతో లభించే ఆరోగ్య ఉత్పత్తులు, మందులు, జీవితబీమాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వినోద్‌కుమార్, సెక్రటరి డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ రాజసింహారెడ్డి, హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ శంకరయ్య, వైద్యాధికారులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నియామకం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత నియమితులయ్యారు. 2 నెలల క్రితం ఈమె నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గైనకాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. సీనియారిటీ ఉండటంతో డాక్టర్ సుజాతను సూపరింటెండెంట్‌గా నియమించారు

సరుకుల వితరణ

బద్వేలు అర్బన్ : అనారోగ్యంతో మృతిచెందిన తమ తోటి డ్యాన్సర్ కుటుంబానికి డ్యాన్స్ మాస్టర్లు అండగా నిలిచారు. నిత్యావసర సరుకులు అందజేసి ఆ కుటుంబానికి మేమున్నామంటూ భరోసా కల్పించారు. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన సీనియర్ డ్యాన్స్ మాస్టర్ అల్తాఫ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బద్వేలు డ్యాన్స్ మాస్టర్స్ యూనియన్ ప్రతినిధులు అల్తాఫ్ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. డ్యాన్స్‌మాస్టర్లు బాబు, వెంకట్, కరీం, కిరణ్, యాంకర్ క్రిష్ణవేణి పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో ఎస్జీఎఫ్ మండలస్థాయి అండర్ –14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ బాబు, కడప జిల్లా పీఈటీ అసోసియేషన్ ట్రెజరర్ శివకృష్ణ పాల్గొన్నారు.

డీపీటీఓ మొండి వైఖరి విడనాడాలి

మైదుకూరు : ఉద్యోగుల విషయంలో మొండి వైఖరిని విడనాడాలని మైదుకూరు ఆర్టీసీ డిపో ఎన్‌ఎంయూఏ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) తీరును నిరసిస్తూ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఎస్.రాయుడు మాట్లాడుతూ పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను పెంచాలని కోరారు. అక్రమ డెబిట్లను రద్దు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా కేసులు రాస్తున్న అధికారులను విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, దూర ప్రాంత ఓఎంఎస్ సర్వీసులకు పంపుతున్న ఆన్‌కాల్ డ్రైవర్లను తొలగించాలని, కండక్టర్లకు నాణ్యమైన పేపర్ రోల్స్‌ను పంపిణీ చేయాలని కోరారు. ధర్నాలో ఎన్‌ఎంయూఏ కోశాధికారి ఎన్ఎస్.రాయుడు, ఎంవీ.రావు, పీఎస్.రెడ్డి, పీఎస్.గంగాధర్, బీఎం.రెడ్డి, ఎస్‌జీ.రెడ్డి, పి.పోతులూరయ్య, పోలయ్య, ఎస్సీకే.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తాం

చాపాడు : ఈ నెల 10వ తేదీ నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు రవిశంకర్, వంశీకృష్ణలను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసులు, మండల నాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, కృష్ణయ్య, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నందగోపాల్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు చోరీ

బి.కోడూరు : మండలంలోని తంగేడుపల్లె గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి శివకేశవరెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులకొట్టి కాపర్‌వైరును దొంగిలించారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి ఉండటాన్ని గమనించిన శివకేశవరెడ్డి సంబంధిత విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఈ చిన్నయ్యతో కలిసి శుక్రవారం బి.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

చేగువేర స్ఫూర్తితో యువత పోరాడాలి



చే గువేర చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ప్రొద్దుటూరు : చే గువేర స్ఫూర్తితో రాష్ట్ర విభజన హామీలు అమలు కోసం, జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు యువత పోరాడాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురువారం ప్రొద్దుటూరులో చే గువేర వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి క్యూబా పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరుడు చే గువేర అని కొనియాడారు. డాక్టర్ వృత్తిలో ఉంటూ పేదల కోసం అహర్నిశలు ఆయన కష్టపడి గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సునీల్, రమేష్, బన్ని, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కోవర్టు అనడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : మొలకలచెరువు నకిలీ మద్యం రాకెట్లో ప్రధాన సూత్రధారి అయిన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డిని వైఎస్సార్‌సీపీ కోవర్టు అంటూ కూటమి నేతలు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. దుంపలగట్టులోని ఆయన నివాసగృహంలో రెడ్యం మాట్లాడుతూ.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే శంకర యాదవ్‌ను కాదని టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చింది కూటమి నేతలు కాదా అని మండి పడ్డారు. రాజకీయ ఉన్నత విలువలకు తిలోదకాలిచ్చేలా మాట్లాడడం తగదన్నారు. నకిలీ మద్యం ప్లాంట్ ఏర్పాటులో టీడీపీ ప్రమేయమే లేదని ఒకవైపు ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర బుకాయిస్తూనే... మరో వైపు టీడీపీకి చెందిన జయచంద్రారెడ్డిని ఎందుకు సస్పెండ్ చేశారంటూ ఆయన ప్రశ్నించారు. నకిలీ మద్యం స్కాంలో టీడీపీ నేతల ప్రమేయం ఉన్నా... టీడీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో తమ ప్రమేయం లేదని చెప్పడం, జయచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కోవర్టు అంటూ ప్రచారం చేయడం వంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలన్నారు. సరైన సమయంలో కూటమి నేతలకు రాష్ట్ర ప్రజానీకం బుద్ధి చెప్పడం ఖాయమని రెడ్యం హెచ్చరించారు.

జీఎస్టీ 2.0 సంస్కరణతో లాభదాయకం



జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై వైద్య సిబ్బంది ర్యాలీ

ప్రొద్దుటూరు రూరల్ : జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత లభిస్తుందని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చాంపియన్ బి.వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు లోని 16వ సచివాయంలో గురువారం సూపర్ జీఎస్టీపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ చాంపియన్స్ రామాంజనేయరెడ్డి, రామకృష్ణ, సర్పంచ్ షేక్ షమీన్, మోసే, లక్ష్మీ సునీత సచివాలయ చాంపియన్స్, పంచాయతీ కార్యదర్శులు, రామాంజనేయరెడ్డి, రామకృష్ణ, సుహాసిణి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

పోరుమామిళ్ల : జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఆసుపత్రి ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. 18 శాతం నుండి 5 శాతానికి జీఎస్టీ తగ్గించడం వల్ల సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరిగిందని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు శివకృష్ణ, లక్ష్మీ, ప్రైవేటు వైద్యులు కళ్యాణ చక్రవర్తి, షెనాయ్, రమణారెడ్డి, రాజేశ్వరి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాధు వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు సరస్వతి, రఘురామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీపై విద్యార్థుల ర్యాలీ

పోరుమామిళ్ల : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఎస్టీ 2.0, సూపర్‌సిక్స్ వారోత్సవాలలో భాగంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్ రాజు అధ్యక్షతన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పర్వీన్, ఈశ్వరయ్య, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

అత్యవసర మందులపై జీఎస్టీ రద్దు

మైదుకూరు : ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో అత్యవసరమైన మందులపై ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేసిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ తెలిపారు. పట్టణంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి రాయల కూడలి వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో జరిగే ప్రయోజనాలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, మెడికల్ ఆఫీసర్లు డి.సుమధుర, ఎస్.అయేషా, డాక్టర్ బద్వేలి సుబ్బరాయుడు, ఫార్మాసిస్టులు, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలి



గ్యారేజీ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్లను రద్దు చేసి ఉద్యోగులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ఎన్‌ఎంయూఏ డిపో సెక్రటరీ చంద్రయ్య పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రీజనల్ కమిటీ పిలుపు మేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గ్యారేజీ గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దూరప్రాంత ఓఎంఎస్ సర్వీసులకు పంపిస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్స్ విధానాన్ని తొలగించాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగులకు ఇచ్చిన అక్రమ ఛార్జిషీట్‌ను రద్దు చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కడప డిపో మేనేజర్ చర్యలను అరికట్టాలని కోరారు. అలాగే పులివెందుల, జమ్మలమడుగు పల్లె వెలుగు ఓఎంఎస్ సర్వీసులను కండక్టర్ సర్వీసులుగా మార్చాలని కోరారు. స్త్రీశక్తి పథకం ద్వారా రద్దీ పెరిగిన రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేసి ఉద్యోగులకు భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ సీనియర్ నాయకులు కె.వి.రమణ, సీసీఎస్ డెలిగేట్ మల్లి, నాయకులు ఎం.ఎస్.రాయుడు, లక్ష్మయ్య, ఎస్.ఎస్.రెడ్డి, కె.ఎస్.రాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జ్ఞానానంద రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కారొనేషన్ జార్జి క్లబ్‌లో ఈనెల శుక్ర, శనివారం ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.జ్ఞానానంద రెడ్డి తెలిపారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 అమలులో భాగంగా స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో ఈనెల 10, 11 తేదీలలో ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రొద్దుటూరు పరిధిలోని అన్ని ఎలక్ట్రానిక్స్ వ్యాపారులు పాల్గొని తమ ఉత్పత్తులు (టీవీ, ఏసీ, ఎల్‌టీ మానిటర్లు తదితర వస్తువులు) ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 అమలు పట్ల వ్యాపారులకు అవగాహన కల్పించడం, టెక్నాలజీ ఆధారిత పన్ను వ్యవస్థను సులభతరం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యాపారులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ



ఎంఈఓ సావిత్రమ్మకు వినతి పత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బోధనేతర కార్యక్రమాలను ప్రభుత్వ ఉద్యోగాలు శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు గురువారం ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ సావిత్రమ్మకు ఫ్యాప్టో నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల టీచర్ల బోధనా సమయం వృథా అవుతోందని, విద్యార్థులకు బోధన సమయం నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, పరీక్ష పత్రాల మూల్యాంకనం మినహా బోధనేతర కార్యక్రమాలను, విద్యాశక్తి కార్యక్రమాన్ని, జీఎస్టీ లాంటి సీజనల్ సమావేశాలను నిర్వహించమని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసులు, జిల్లా కో చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యం, సలీం, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, జీసీఎం రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనులు చేయం



ఎంఈఓ పద్మలతకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యారంగ తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి పద్మలతకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ జూన్ నెల నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యా కానుకలను అందజేయడం, నివేదికను ఎంఈఓ ఆఫీసుకు పంపడం, విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ ఆన్‌లైన్ చేయడం చేశామని వివరించారు. ఇవన్నీ ఉపాధ్యాయులకు బోధనకు ఆటంకంగా మారుతున్న పరిస్థితుల్లో మళ్లీ అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ హ్యాండ్ బుక్ వంటివి ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యాపరాల వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బీకే.సురేష్, రీజియన్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమణయ్య, బి.చెన్నకేశవ ప్రసాద్, గంగారపు చంద్రశేఖర్, ఈనెపాటి ఈశ్వరయ్య, ఉండేల రవీంద్రారెడ్డి, నారాయణ ప్రసాద్, సుబ్బరాయుడు, విజయ్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



నరసాపురం ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న ఏపీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్ రెడ్డి

కాశినాయన : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీషు బోధన సరళతరం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 164 ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఆ పాఠశాలల్లో కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని ఏపీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నరసాపురం ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు రూల్స్ లేక మోడల్ పాఠశాలల ఉపాధ్యాయులు సమస్యలను ఎదుర్కొంటున్నారని, సర్వీసు రూల్స్ అమలు చేయాలని కోరారు. అలాగే ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తూ 18 మంది ఉపాధ్యాయులు మరణిస్తే వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కారుణ్య నియామకాలను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, ఎస్టీయూ నాయకులు సుబ్రహ్మణ్యం, మునిరత్నం, జయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.